# రాయి మడుసులు

క్రిష్ణ ఒడ్డునవుండ ఆ నల్లరాయి కొండ బొహు గెట్టిది. దాన్ని సూపించి, దాని రాయితో తనకు బవనం బొహు గెట్టిగ కట్టాలన్నాడు సావుకారు, రాయి మడుసుల్తో.

సావుకారుకు లచ్చల్లచ్చ ఉండయి. ఆయన్ని వూరో బొహు గొప్పోడంటారు జనం. అంత గొప్పోడికి ఎంతమాలావు గెట్టిగన్నా వుండాల బవనం.

వందలకొద్దీ కూలిరాయిమడుసులు సావుకారు బవనానికి నల్లకొండను తొలుత్తా వుండారు.

ఒక్కోపాలి కొండమయాన సెక్కలు బిగదీసి నిలబడి తొలుత్తా వుంటం బొహు పెమాదం. అలుపుమీన కాలు జారిందంటే... అయితే రాయి మడ్సుల గుండె బొహుగెట్టి. జనం నల్లరాయి గెట్టంటారు గాని అంతా వుత్తది.

రాయిమడ్సుల జంపరి దెబ్బకు నల్లరాయి గుంటపడుద్ది. ఆ గుంటలో బోలుడు మందు కూరి - సానా పెమాద - టపీ ల్మనిపించేతలికి ఒక్కపాలి పది పదేను బళ్ళ బండరాళ్ళు ఎగిరి కిందపడాల్సిందే.

సావుకారు బవనానికి సయిజు సరిజూసి అట్ని ముక్కలముక్కలగ నరుకుతారు రాయిమడ్సులు. అయి ఎన్న కరిగినట్టు కరుగుతయి అరి సేతుల్లో. అట్టాటి వందలు, ఏలు, లచ్చల సయిజు ముక్కల్ని బవనం కట్టేకాడికి తోల్తారు రాయి మడ్సులు- దుమ్ము! బొహు దుమ్ము! ముక్కునా నోట్నా బోయి కడుపులో అచ్చులు పేరుకుంటాయి.

రాళ్ళగట్టలు సుట్టూతా తిరుగుతా నవుకుంటాడు సావుకారు.

పునాదిమీన గొబ్బిరికాయ కొట్టి, దణ్ణంపెట్టా పక్కకి తప్పుకుండాడు సావుకారు.

రాయిమీన రాయి, గోడమీన గోడ, అంతస్తుమీన అంతస్తు—ఎటాయినా రాయి బహు దొంగది. అప్పుడప్పుడు ఈలుజూసుకుని తూల్తా వుంటది. అట్టాటి తూలుడు రాయి మడ్సులకు బొహు పెమాదం. ఎంత రాయిమడిసి గెట్టిమడిసయినా ఆ తూలుడుకు ఒల్లు రంద్రంబడి రకతం కారుద్ది. బరువుతోకూడ్ని పని గనక ఒల్లు కాకెక్కి రకతం మరింత వసిమీన పిసికారు కొటినట్టయి, నల్లరాళ్ళు ఎర్రబడి పూటకారుత్తయి కూడా- అంతరిచ్చానికి రాయిమడ్సుల రకతంగక్కుతా లెగిసింది సావుకారు బవనం.

జనం ముక్కుమీన ఏలేసుకుండారు సావుకారు గొప్పజూసి. 'ఎంతగెట్టి! అబ్బ ఎన్నిరంగులు! అబ్బ, అమ్మనాయినో!' అన్నారు జనం.

ఒక పెడగా వుండి సేతులు సూసుకుండాడు రాయి మడిసి.

బవనం గొప్ప సూపియను గొప్పోరికి బవనంలో యిందుజేశాడు సావుకారు. యిందుకుడిసి బవనం జూత్తా గొప్పోరు సావుకార్ని 'గొప్పో'డన్నారు.

సేతులు కడుక్కొని 'ఎల్లొత్తా' నన్నాడు రాయిమడిసి సావుకార్ని దూరంగా సూత్తా. 'వొచ్చి కూలీ తీసుకుపోవేందిరా? వూఁ బేగి!' అన్నాడు సావుకారు గుమాత్తా మద్దెనొచ్చి.

ఆక్రరోజు కూలి అద్దరూపాయ, కండువా కొంగున సుట్టి, పొద్దువాల్ని కూసేపుటికి గూడెంలో గుడిశకి సేరుకుండాడు రాయిమడిసి.

'అయినట్టేనా?' అంది రాయిమడిసి పెల్లాం రాయిమడిసికి బువ వొడ్డిత్తా.

'అయిందేంది!' అన్నాడు రాయిమడిసి యిసుగ్గా.

'ఏం దవుద్దం? యియ్యాల్తో అయిద్దంటివిగా?'

'అవకేం జేసుద్దిలే!'

'ఉహుఁ! ఎవుడన్నాడు కాదనీ!'

'ఎహె వుండు నసా!'

'యీడ ఎవురికేం పట్టలా నసబెట్టను!'

'అయితే ఏందే నువనేదీ?'

'నాకేం ఒట్టింది అంటానికీ! అయిపాయె గందా, సావుకారేమన్నాడన్నా?'

'సావుకారా!'

'యిగసాల్లే! అదేందో యిందు జేత్తా వుండాడంటగా?'

'యిదా- ఏం జేత్తే?'

'నాకు దేనికిలే మొదులు! ఏందో పద్దాక ఇంత కాసి బోత్తావుంటే ఎల్లిపోతుండె దినాలు. యిందులో వుసాబుగుంటాడు గందా, ఏమన్నా అడిగిసూత్తానంటి వనన్నా, ఇగవేం వుటవీ!'

'యిగ ఆడకి ఆపు! సాలు, తిక్కరేగుతుండది. ఎవుడు నిన్ను నోరు దెరుసుకు కూకోమన్నాడూ?'

'ఏమన్నా యియకుంటాడుగా అని నువేగా ముంగలందీ? మాటకు ముంగల నన్ను దేనికి అంటం?'

'సల్ల బొయి?'

'లేవు సల్ల. మంగమ్మ యికమీన దొరకవంది. పెతోరు దబ్బిత్తుంటే, మనకి వూరంకనే పోత్తారెట్టా? సల్లసుక్కకు గెతి లేదు.'

లెగిసి తభీమని పడ్డది రాయిమడిసి పెయి.

'సచ్చావ్రా నాయినో' అంటా అటనే ఎనిక్కిపడింది రాయిమడిసి పెళ్ళాం.

తుబుక్కున పుమ్మొసి ఎల్లి సాపమీన కందవాగప్పకుని పండుకున్నాడు రాయిమడిసి.

'యదవ సచ్చినోడా !' అంది రాయిమడిసి పెళ్ళాం, కూసేపుండి.

రాయిమడిసి మాట్టాళ్ళేదు.

రేత్తిరి సానా పొద్దుపోయింది.

'తిక్కరేగుండ మడిసితో మాట్టాడొద్దని లచ్చసార్లు జెప్పా !' అన్నాడు రాయిమడిసి

నిసిరేత్తిరయింది.

'మా వూరెల్లిపోక యీ దెవురుంటారు !' అంది రాయమడిసి పెల్లాం.

రాయిమడిసి మాట్టాళ్ళేదు. కూసేపయినాక 'కాత్తె జరగ' మంది రాయిమడిసి పెల్లాం... యిం కూసేపుటికి ఎప్పటికిమల్లే తెల్లారుద్ది రాయిమడుసులకి.